# ఎన్టీఆర్ ఆశయాలను మరువం: చంద్రబాబు

- సమరయోధుల పింఛన్లపై నాడు అద్వానీకి గట్టిగా చెప్పాం
- విమోచన దినోత్సవంలో పోరాట వీరులకు బాబు సన్మానం

మేం అధికారంలో ఉన్నప్పుడు.. తెలంగాణ సమరయోధుల పింఛన్ల కోసం.. సీహెచ్ రాజేశ్వరరావును తీసుకుని అద్వానీ వద్దకు వెళ్లి గట్టిగా అడిగాం. అయితే రాజకీయ కారణాల వల్ల పింఛన్లు ఆచరణలోకి రాలేదు. ఈసారి అధికారంలోకి వస్తే పింఛన్ల కోసం గట్టిగా కృషిచేస్తాం.

– చంద్రబాబు

హైదరాబాద్, న్యూస్‌టుడే: నాడు నిజాం ప్రభువు నిరంకుశత్వానికి, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా చేసిన పోరాటాన్ని.. నేడు అవినీతి, అక్రమార్కులపై చేయాలని తెదేపా అధినేత చంద్రబాబు పిలుపిచ్చారు. ఎన్టీఆర్ ఆశయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించబోమన్నారు. పేదలకు సంపదను పంపిణీ చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా బుధవారమిక్కడ ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో జాతీయ జెండాను బాబు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధులు నారాయణరావు పవార్, శ్రీధర్, పర్సా సత్యనారాయణ, మల్లు స్వరాజ్యం, నంద్యాల శ్రీనివాసరెడ్డి, సి. హెచ్. రాజేశ్వరరావు, పిచ్చిరెడ్డిలకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ఆశయాలను తప్పనిసరిగా ఆచరిస్తామని, పేదరికం లేని సమాజం కోసం నిద్రలేకుండా పోరాడతామని ఉద్ఘాటించారు. కడియం శ్రీహరి, నాగం జనార్దన్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బుచ్చయ్యచౌదరి, తలసాని శ్రీనివాసయాదవ్, పొగాకు యాదగిరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చంద్రబాబు, నేను ఒకే జైల్లో ఉన్నాం: పర్సా

చంద్రబాబు, తాను ఒకే జైల్లో ఉన్నామని పర్సా సత్యనారాయణ గుర్తుచేసుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటం ముగిసినా.. 1953 వరకు తాను జైల్లోనే ఉన్నానని చెప్పారు. తెదేపా గతంలో ప్రతిపక్షంగా ఉన్నప్పుడు ఆర్టీసీ ధరల పెంపు సందర్భంగా వామపక్షాలతో కలిసి ఆందోళన చేసినప్పుడు హైదరాబాద్‌లో తాను, చంద్రబాబు ఒకే జైలుకెళ్లామని గుర్తుచేసుకున్నారు.

## సాయుధ పోరాటానికి అన్ని ప్రాంతాలూ మద్దతిచ్చాయి: రాజేశ్వరరావు

తెలంగాణ సాయుధ పోరాటం కోసం సరిహద్దుల్లో శిబిరాలు పెడితే.. వాటికి ఆంధ్ర, మరాఠా ప్రాంతాల నుంచి మందుగుండు, డబ్బు, ఆహారం.. ఇలా అన్నిరకాలుగా సాయం అందిందని సీహెచ్ రాజేశ్వరరావు చెప్పారు. తెలంగాణ పోరాటాలన్నీ అంతిమంతా ప్రత్యేక రాష్ట్ర పోరాటంతో మిళితమవుతాయని మరో సమరయోధుడు శ్రీధర్ అన్నారు. ప్రత్యేక రాష్ట్రమే అంతిమంగా ఈ ప్రాంతానికి స్వాతంత్ర్యం తెస్తుందని తెలిపారు.

## ఎన్టీఆర్ ఆశయాలను తప్పితే తెదేపాకు ఆదరణ ఉండదు: మల్లు స్వరాజ్యం

విశాలాంధ్రలో ప్రజారాజ్యం భావనతో కమ్యూనిస్టులు పోరాడారని, ఇప్పుడు ప్రజారాజ్యాన్ని ఎవరో తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని చిరంజీవి పార్టీని ఉద్దేశించి సీపీఎం నాయకురాలు మల్లు స్వరాజ్యం వ్యాఖ్యానించారు. అయితే ప్రజారాజ్యాన్ని ఎవరు సాధించినా మంచిదేనని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దళ కమాండర్‌గా పనిచేసి, సీపీఎం నాయకురాలిగా ఉన్న తనను తెదేపా పిలిస్తే మొదట తటపటాయించానని, అయితే పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన వారందరికీ సన్మానమన్న ఉద్దేశంతో వచ్చానని తెలిపారు. ఎన్టీఆర్‌కు పేదలంటే ప్రేమని, ఆయన ఆశయాలకు ఒక్కడుగు పక్కకెళ్లినా తెదేపాకు ప్రజాదరణ ఉండదని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడే ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# పోరాట వీరులకు దేవేందర్ జోహార్లు

## మంథనిలో జాతీయ జెండా ఆవిష్కరణ

మంథని, హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధ పోరాటంలో అసువులు బాసిన యోధులకు నవ తెలంగాణ ప్రజాపార్టీ అధినేత దేవేందర్‌గౌడ్ జోహార్లు అర్పించారు. హైదరాబాద్ విమోచన దినాన్ని పురస్కరించుకుని బుధవారం కరీంనగర్ జిల్లా మంథని మార్కెట్ ఆవరణలో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. తెలంగాణ సాధనే తమ అంతిమ లక్ష్యమని ప్రకటించారు. ఆయన వెంట మాజీ మంత్రి పెద్దిరెడ్డి తదితరులు ఉన్నారు. పార్టీ సీనియర్ నేత మల్యాల రాజయ్య హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జాతీయ పతాకం ఎగురవేశారు. పార్టీ నాయకులు విఠల్, ప్రకాష్, మేచినేని కిషన్‌రావు, టి.ప్రతాపరెడ్డి, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించకపోవడం అమరవీరుల త్యాగాలను అవమానించినట్లేనని నేతలు విమర్శించారు. నాలుగున్నరవేల మంది తెలంగాణా వీరుల ఆత్మత్యాగం పాలకుల కళ్ళకు కనడడంలేదా అని ప్రశ్నించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాడే తెలంగాణ ప్రజలకు నిజమైన విముక్తిగా పేర్కొన్నారు.